

వేసవి వెళ్లిపోయింది. వానలు కురుస్తూనే శరదృతువు వచ్చేసింది.
భగభగమండే ఎర్రనయ్య.. పసుపు పండులా మారిపోయాడు.
- శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో కనిపించిన దృశ్యం.

భళా..భాగవతార్



భక్తితత్వమే ప్రధానంగా ఆవిర్భవించి కాలానుగుణంగా కనుమరుగవుతున్న హరికథకు ప్రాణం పోస్తున్నారు ఒంటి రవి. కార్వేటినగరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తూ మరోపక్క తనలోని కళాప్రతిభను చాటుకుంటున్నారు. భక్తి, వినోదం, విజ్ఞానాన్ని అభినయపూర్వకంగా ప్రదర్శిస్తున్నారు. ప్రేక్షకుల మన్ననలందుకుంటున్నారు.

8లో

కొండలా పేరుకున్న చెత్త



తిరుమలలో కొండలా పేరుకుపోతున్న చెత్తపై టీటీడీ ఫోకస్ పెట్టింది. గడచిన ఐదేళ్లూ పట్టించుకోకపోవడంతో వ్యర్థాలు గుట్టలా పోగయ్యాయి. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక బీఆర్ నాయుడు డంపింగ్‌యార్డును పరిశీలించి విస్తుపోయారు. ఈ నేపథ్యంలో ఈవో శ్యామలరావు శుక్రవారం సందర్శించారు. మూడునాలుగు నెలల్లో చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.



మనసు నిండా భక్తి నింపుకొని ఆనంద నిలయంలో అడుగు పెట్టగానే భక్తులంతా దివ్యానుభూతికి లోనవుతారు. మరికొన్ని అడుగులు వేయగానే కాంతులీనే శ్రీనివాసుడు కనిపించే సరికి భక్తితో తన్మయత్వం చెందుతారు. జయవిజయుల దగ్గరకు చేరగానే తేజోవంతమైన శ్రీవారి మనోహర రూప దర్శనం చూసి ఆధ్యాత్మికానందంతో పరవశించిపోతారు. అంతా క్షణకాలమే! ఆ కాస్త సమయంలోనే శ్రీనివాసుడి మూలవిరాట్ స్వరూపం భక్తుల మదిలో ముద్రపడిపోతుంది. తిరుమలేశుడి రూపం అంత స్పష్టంగా కపించేలా చేస్తున్నది ఆధునిక విద్యుత్ వెలుగులు కాదు. కేవలం నెయ్యి దీపాలు. తరాలుగా ఈ నెయ్యి దీపాల వెలుగులోనే గర్భగుడిలోని వెంకటేశ్వరుని దర్శనం భక్తులకు కలుగుతోంది.



సిట్ సిద్ధం

తిరుపతి చేరుకున్న బృందాలు

భూదేవి కాంప్లెక్స్‌లో కార్యాలయం

కల్తీ నెయ్యిపై నిగ్గు తేల్చనున్న దర్యాప్తు

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై విచారణకు సుప్రీం కోర్టు నియమించిన సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) బృందానికి సంబంధించిన సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకున్నారు. వారికి అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సులో కార్యాలయం కేటాయించారు. అక్కడ అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటయ్యాక సిట్‌ను నడిపే కీలక అధికారులు రానున్నారు. ఆపై టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చనున్నారు. సిట్ విచారణకు వివిధ అంశాల్లో సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 31 మంది సిబ్బందిని నియమించింది. ఆ సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకుని పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ ఎదుట రిపోర్టు చేసుకున్నారు. అనంతరం సిట్‌కు కార్యాలయం కేటాయించిన భూదేవి కాంప్లెక్సులోని పాత ఎస్వీబీసీ భవనానికి చేరుకున్నారు. అందులో సిట్ బృందానికి అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటవుతున్నాయి. వారం పది రోజుల్లో అవన్నీ పూర్తయ్యాక సిట్ కీలక అధికారులు ఐదుగురు తిరుపతికి రానున్నట్టు సమాచారం. తిరుపతి కేంద్రంగా సిట్ చేపట్టే దర్యాప్తులో సహకరించేందుకు వచ్చిన సహాయక సిబ్బందిలో మదనపల్లె, కర్నూలు, తిరుపతి, ఒంగోలు ప్రాంతాలకు చెందిన నలుగురు డీఎస్పీలు, రాయలసీమ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది సీఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అటెండర్లు వంటి సిబ్బంది 19 మంది ఉన్నారు.

వారం పది రోజుల్లో రానున్న కీలక సభ్యులు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ అనే సంస్థ కల్తీ చేసి సరఫరా చేసిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులను తీవ్ర మనోవేదనకు గురిచేసిన సంగతి తెలిసిందే. లడ్డూ నాణ్యత, రుచి, సువాసన వంటి వాటిపై తరచూ భక్తుల నుంచీ ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీటీడీ ఈవో శ్యామలరావు చొరవ తీసుకుని నెయ్యి నమూనాలను పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ అనుబంధ ల్యాబ్‌కు పంపడం, ఆ పరీక్షల్లో నెయ్యి నాణ్యత దారుణంగా ఉందని, అందులో జంతు కొవ్వు, చేప నూనె వంటి పదార్థాలు కల్తీ చేశారని ల్యాబ్ అనుమానం వ్యక్తం చేయడం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. విచారణలో ఏఆర్ డెయిరీ తమిళనాడులోని దిండిగల్ నుంచీ కాకుండా తిరుపతికి చేరువలోనే ఉన్న వైష్ణవి డెయిరీ నుంచీ నెయ్యి సేకరించి దాన్నే టీటీడీకి సరఫరా చేసినట్టు వెల్లడైన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు గత అక్టోబరు 4వ తేదీన సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ పోలీసు నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు అధికారులతో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను నియమించింది. అప్పటి నుంచి సిట్ విచారణ ఎప్పుడు మొదలవుతుందా? ఆ విచారణలో ఏమి తేలుతుందా? అని దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులు ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సిట్ సహాయక సిబ్బంది తిరుపతి చేరుకోగా వారం పది రోజుల్లో సిట్ కీలక సభ్యులు రానున్నారు. మొత్తం మీద సుప్రీం కోర్టు విచారణకు ఆదేశించిన నెలన్నర తర్వాత ఆ దిశగా కదలిక మొదలైంది. కీలక సభ్యులు వచ్చి విచారణ ప్రారంభిస్తే నెల రోజుల్లోనే ముగించి సుప్రీం కోర్టుకు నివేదిక అందజేసే అవకాశముందని సమాచారం.

తిరుమల గర్భగుడిలో నేటికీ

నెయ్యి దీపాలే!

తిరుమల ఆలయం (గర్భాలయం మినహా)లో ఒకప్పుడు వెలుగులు ప్రసరించేలా 24 దీపాలను వెలిగించేవారు. కాలానుగుణంగా ఆ నేతి దీపాల స్థానంలో కిరోసిన్, నూనె, తర్వాత విద్యుత్ వెలుగులు వచ్చాయి. గర్భాలయంలోకి మాత్రం వీటికి ప్రవేశం లేదు. ఇప్పటికీ అఖండ దీపాలే వెలుగుతూ ఉన్నాయి. మూలభాగాల్లో రెండు అఖండ దీపాలుంటాయి. మరో రెండు దీపాలు వేలాడుతూ ఉంటాయి. రోజూ ఈ దీపాలకు దాదాపు 30 కిలోల నెయ్యి వినియోగిస్తారు. గర్భాలయ దీపాల పర్యవేక్షణను ఇద్దరు ఏకాంగులు నిర్వర్తిస్తారు. సుప్రభాతసేవలోనూ, మొదటిగంట నిర్వహించే సమయంలోనూ, కల్యాణోత్సవం తర్వాత 1.30 గంటలకు, రాత్రి నైవేద్యం గంట సమయంలో ఈ దీప కుండీల్లో నెయ్యిని నింపుతారు. వత్తులు ఎగదోయడం, మసిని తుడవటం వంటివి చేస్తారు. జయవిజయుల నుంచి గర్భాలయంలోని శ్రీనివాసుడు వృద్ధులకు సైతం స్పష్టంగా కనిపించేలా కాంతి తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. క్షణకాల దర్శనంలో స్వామి రూపం మదిలో నిలిచిపోవడంలో ఈ దీప కాంతులు ప్రధాన పాత్ర పోషిస్తాయి.




బ్రహ్మ వెలిగించిన దీపాలు

వెంకటేశ్వరుడు ఆనంద నిలయంలోకి ప్రవేశించిన శుభ సమయంలో బ్రహ్మదేవుడు రెండు అఖండ దీపాలను వెలిగించాడనేది ఐతిహ్యం. ఈ దీపాలను 'బ్రహ్మ అఖండం' అని కూడా వ్యవహరిస్తారు. శ్రీనివాస ప్రభూ.. నేను వెలగించిన అఖండ దీపాలు కలియుగాంతం వరకు నిరాటంకంగా ప్రకాశించాలి. అంతవరకు కొంగుబంగారమై భక్తులకు వరాలను గుప్పించాలని బ్రహ్మ కోరారట. 'కలియుగాంతమయ్యాకే ఆ దీపాలు రెండు శాంతిస్తాయి. అంతవరకు భక్తుల కోరికలు తీరుస్తూ ఉంటాను. తర్వాతే వైకుంఠానికి వెళ్తాను. అప్పుడే ఆనంద నిలయం కూడా అదృశ్యమవుతుందని శ్రీనివాసుడు బ్రహ్మాది దేవతలకు తెలియజేశారట. ఈ క్రమంలోనే వేల ఏళ్ల క్రితం వెలిగించిన దీపాలు నేటికీ దివ్య కాంతులను ప్రసరిస్తున్నాయి అని నమ్మకం.

శాసనాల్లో దీపాల నిర్వహణ

శ్రీవారి ఆలయం గర్భాలయ ప్రాకారంపై క్రీ.శ 8 నుంచి 18వ శతాబ్దం వరకు ఏర్పాటు చేసిన అనేక శాసనాల్లో ఈ దీపాల ప్రస్తావన ఉంది. వాటికి వినియోగించాల్సిన స్వచ్ఛమైన నెయ్యి గురించి స్పష్టంగా పేర్కొన్నారు. 1019 చోళరాజు రాజేంద్ర-1 కాలానికి చెందిన ఓ శాసనంలోనూ అఖండ దీపాల గురించి ఉంది. దీపాలకు వినియోగించే నెయ్యి, నిర్వహణ కోసం చేసిన దానాల గురించి ఈ శాసనాల్లో ఉంది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



బల నిరూపణకు సిద్ధంకండి

తెలుగుదేశం అసంతృప్తులతో నేను మాట్లాడతా

- వైసీపీ కార్పొరేటర్లతో మంత్రి అనగాని
- టీడీపీలో చేరేందుకే సింహభాగం కార్పొరేటర్ల సుముఖత



మంత్రితో సమావేశమైన తిరుపతి కార్పొరేటర్లు

తిరుపతి, నవంబరు22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమవుతోంది. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారు. బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో గురువారం 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు పయమైన విషయం తెలిసిందే. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీలో ఉండలేమని, టీడీపీలోకి వచ్చేస్తామని మనసులో మాట చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈనెల 28న సీఎం సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు తిరుపతికి వస్తున్నామని, తమ పార్టీలోని అసంతృప్తులతో మాట్లాడతానని అన్నారు. పార్టీ అధిష్ఠాన నిర్ణయం మేరకే జరుగుతుందని చెప్పారు. 29న తిరుపతిలోనే ఉంటామని, పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకోవాలని సూచించినట్టు తెలియవచ్చింది. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడిపోయిన వారి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. రాబోయే పురపాలక ఎన్నికల్లో డివిజన్ల విభజన జరగనుందని, మరో 15 నుంచి 20 డివిజన్లు పెరిగే అవకాశం ఉందని, అందువల్ల కూటమిలో కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకునే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండబోదని మంత్రి చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లతో పాటు కొత్తగా వచ్చేవారితో 24 మంది కార్పొరేటర్లు ఉన్నారని మంత్రికి అన్నా రామచంద్రయ్య చెప్పారు. కాగా ఎక్కువ మంది టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. మంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, సీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య తదితరులు ఉన్నట్టు సమాచారం.

డిప్యూటీ కలెక్టర్ మురళి సస్పెన్షన్ కొనసాగింపు

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ గత జూలైలో సస్పెండ్ అయిన డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.మురళికి సంబంధించి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు, నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలో గత జూలైలో మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో అగ్ని ప్రమాదం సంభవించడంతో కీలక ఫైళ్లన్నీ కాలి బూడిదయ్యాయి. ఆ ఘటనలో ఆయన ప్రమేయం ఉందన్న ఆరోపణలతో ప్రభుత్వం అదే నెల 29వ తేదీన సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెన్షన్‌లో ఉండగానే తిరుపతి ఏసీబీ అధికారులు ఇటీవల ఆయనకు చెందిన నివాసాలు, బంధుమిత్రుల నివాసాలు, బినామీల నివాసాల్లో పెద్ద ఎత్తున దాడులు జరిపారు. ఆ సందర్భంగా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారంటూ 06-ఆర్‌సీఏ-టీసీటీ-2024 క్రైమ్ నంబరుతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండుకు ఆదేశించింది. కేసు నమోదై విచారణ చేపట్టిన నేపథ్యంలో మురళి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తిరుపతి విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించండి

తిరుపతి(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు తక్షణం ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ సూచించారు. ఫీజు చెల్లించేందుకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందని, ఇప్పటికీ జిల్లాలో 14,916 మంది ఫీజులు చెల్లించలేదని వెల్లడించారు. ఫీజుల చెల్లింపులో 49 పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరై ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. తొలగింపుల కోసం ఫారం-7, సవరణకు ఫారం 8 స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి ఇంకా ఓటు హక్కు పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంస్కృత వర్సిటీలో డ్రగ్స్ కలకలం!

- ఒడిశాకు చెందిన ఓ విద్యార్థిపై అనుమానం
- కూపీ లాగుతున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగింది. వర్సిటీ గరుడాచలం హాస్టల్లోని ఓ గదిలో డ్రగ్స్ ఉన్నాయంటూ వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు గణేష్ నేతృత్వంలో నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తిని డిమాండ్ చేశారు. దీనిపై వర్సిటీ అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే పోలీసులు ప్రాథమిక వివరాలను కొంతవరకు సేకరించినట్టు తెలుస్తోంది.

ఆరోపణలు ఇలా..

వర్సిటీలోని గరుడాచల హాస్టల్లో ఒడిశాకు చెందిన ఓ ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థి వద్ద 20 డ్రగ్స్ ప్యాకెట్లు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న మరో విద్యార్థికి 14 ప్యాకెట్లను అందజేసినట్టు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులకు వాటిని అందజేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏబీవీపీ నేత గణేష్ ఈ మేరకు ఆరోపించారు.

అసలేం జరిగింది?

యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగడంతో యూనివర్సిటీ డ్రగ్స్ కమిటీ అత్యవసరంగా సమావేశమైంది. అసలు ఏం జరిగిందంటూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ తదితరులు డ్రగ్స్ కమిటీ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోపణలు వస్తున్న హాస్టల్ సిబ్బంది, విద్యార్థులను విచారించినట్లు చెప్పారు. చీఫ్ వార్డెన్‌ను పిలిపించి మాట్లాడారు. అంతా అబద్ధమని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ కొట్టి పారేశారు.



విచారణ జరుపుతున్న వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ

డాగ్ స్క్వాడ్‌తో వాస్తవాలు నిగ్గుతేలుతాయా?

డాగ్ స్క్వాడ్ ద్వారా విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్‌లో 22 కేజీల డ్రగ్స్ ప్యాకెట్లు డాగ్ స్క్వాడ్ ద్వారా దొరకడంతో ఇదే తరహాలో తనిఖీ చేయించాలనే అభిప్రాయం వినిపిస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో వర్సిటీలో డ్రగ్స్ అనవాళ్లు లేకుండా చేయవచ్చని యూనివర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా,డ్రగ్స్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

రీసెర్చ్ ఫెలో, అసోసియేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో పీఎం-ఉష పథకం ద్వారా మంజూరైన ప్రాజెక్టులో రీసెర్చ్ ఫెలో, రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిసెంబరు 17వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడవచ్చునని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.వాణి తెలిపారు.

పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించండి

భాకరాపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీవో సురేశ్ కుమార్ నాయుడు అన్నారు. రంగన్నగారిగడ్డ, భాకరాపేట, చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె పంచాయతీల సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీల ఆదాయం, వ్యయం, సిబ్బంది హాజరు పరిశీలించారు. స్వర్ణ పంచాయతీ సర్వే సమగ్రంగా చేపట్టాలన్నారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, ఏవో సతీశ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఎరువులు, పురుగుల మందు దుకాణాల తనిఖీ

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ అధికారి విజయ్‌భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎరువులు, అన్ని రకాల పురుగుల మందులు కృత్రిమ కొరత సృష్టించడం, అనధికారికంగా నిల్వ చేయడం, కల్తీ ఎరువులు అమ్మకం వంటి అంశాలపై ఫోకస్ పెట్టారు. లోపాలు గుర్తిస్తే డీలర్లపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

రామ్మూర్తి నాయుడు కర్మక్రియ ఏర్పాట్ల పరిశీలన

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లతో పలువురు నేతలు హాజరుకానున్న నేపథ్యంలో భోజనం, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం రామ్మూర్తినాయుడు పెద్ద కుమారుడు గిరీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న గిరీష్

మల్లయ్యపల్లె వద్ద రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్లయ్యపల్లె సమీపంలో అనుప్పల్లె రోడ్డు మార్గంలో మలుపు వద్ద తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇటీవల రోడ్డు మధ్య గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మట్టి పోశారు. కానీ వర్షాలకు మళ్ళీ రోడ్డు గుంతలమయం అయింది. దీంతో వాహనదారుల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. తాత్కాలికంగా మళ్ళీ మట్టి పోసి మరమ్మతులు చేశారు.



లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

పాకాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లెలో లోవోల్టేజి సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పెరగడంతో తరచూ ఫీజులు పోయి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇండ్లలో విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదు. టీవీలు, ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. మసీదు సమీపంలో 3 ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్ బోరుకు మాత్రమే కనెక్షన్ ఇచ్చారు. అదనపు లోడు సరఫరాకు తగిన రుసుము చెల్లించినా అధికారులు స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పలుసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదన్నారు.



ప్రమాదకర గుంతను పూడ్చండి

తిరుపతి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళం బీటీఆర్‌పురంలో ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. తెలుగుగంగ పైపుల నుంచి నీరు లీకవుతుండడంతో ఐదు రోజుల క్రితం పెద్దగుంత లోడారు. పైపుల మరమ్మతు పనులు పూర్తిచేయకుండా వదిలేశారు. రాయచోటికి చెందిన రాము(8) బంధువుల ఇంటికి వచ్చి ఆడుకుంటూ గుంతలో పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే బాలుడిని పైకి తీసేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. తెలుగుగంగ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, వెంటనే గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● కలెక్టరేట్ వద్ద ధర్నా

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు వేతనం అమలు చేయాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఏపీ ప్రజాగ్రామ వలంటీర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వీరికి సీఐటీయూ నేతలు మద్దతు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, వలంటీర్స్ యూనియన్ నాయకులు మురళి, సుప్రజ, వెంకట్, దీప్తి తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వం వలంటీర్లకు ప్రశంసలు, అవార్డులు, రివార్డులే తప్ప కనీస వేతనాలు, పనిగంటలు, పని భద్రత, విధివిధానాలు లేకుండా చాకిరీ చేయించిందని గుర్తుచేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నాయకుల ఒత్తిడితో రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆందోళనకారులను తిరుచానూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంతసేపటి తర్వాత విడిచిపెట్టారు. ఈ నిరసనలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన వలంటీర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వలంటీర్లు

నిబంధనలను ఉల్లంఘించి భవనాల నిర్మాణం తగదు

తిరుపతి(ఆటోనగర్)నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయితీలో కొందరు బిల్డర్లు నిబంధనలకు వ్యతిరేకంగా భవనాలను నిర్మిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పంచాయితీ, తుడా నిబంధనలు పట్టించుకోకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని తెలిపారు. 20 అడుగుల రోడ్లే ఉన్నాయన్నారు. అయినా అధికారులు బహుళ అంతస్తులకు ఎలా అనుమతులిస్తున్నారని ప్రశ్నించారు. ఇరుకు వీధుల్లో ఏళ్ల తరబడి నిర్మాణాలు చేయడంతో పాఠశాల బస్సులు, ఆటోలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

శాస్త్రోక్తంగా కార్తీక ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశ దీపం వేదోక్తంగా వెలిగించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. ఆలయ ఏఈవో హేమమాలిని, సురేష్, అధికారులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



●ఏర్పేడు: మండలంలోని కందాడ గ్రామంలోని శివాలయంలో శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో రాస్ మహిళా భారతి సంఘాల సభ్యులు కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం శివలింగాకృతితో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. ఇక సదాశివపురంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన సభ్యులకు జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ హరిబాబు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి, వెంకట్ కుమార్, మునిపార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కేంద్రమంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే - హన్సరాజ్

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్ర మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే, ఎంపీ శ్రీకాంత్ షిండే, జాతీయ బీసీ కమిషన్(ఎన్‌సీబీసీ) చైర్మన్ హన్సరాజ్ అహిర్, తెలంగాణ ఎమ్మెల్యే అనిరూధ్ రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మహారాష్ట్ర మంత్రులు ఉదయ్ సమంత్, సుధీర్ ముంగంటివార్, రాధాకృష్ణ విఖే పాటిల్, సంబాజీ పాటిల్ నీలంగేకర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు



తిరుపతి (నేరవిభాగం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌ఐ కవీశ్వర నాయుడు అరెస్టు చేశారు. శుక్రవారం బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రేణిగుంట మండలం గణేష్‌నగర్‌కు చెందిన గ్లాడ్విన్ నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేశారు.

షార్‌ను సందర్శించిన ప్రముఖులు

సూళ్లూరుపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను శుక్రవారం ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ మాధవి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(జీఏడీ) జీ.వాణి మోహన్ సందర్శించారు. ముందుగా వీరు అట్టకానితిప్ప పులికాట్ సరస్సును పరిశీలించారు. అనంతరం షార్‌లోని రెండు ప్రయోగ వేదికలు, స్పేస్ మ్యూజియాన్ని తిలకించారు. రాకెట్ ప్రయోగాలతో పాటు అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాల గురించి షార్ అధికారులు వివరించారు. వీరి వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ నరసంహారావు ఉన్నారు.

వేదోక్తంగా ఊంజల సేవ

నారాయణవనం, నవంబర్ 22: పట్టణంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఊంజల సేవను నిర్వహించారు.

మామండూరు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు

రేణిగుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు అటవీ ప్రాంతంలోని వాగు వద్ద శుక్రవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ వాగులో స్నేహితులను కాపాడి ఓ మిత్రుడు గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రదేశానికి వచ్చే సందర్శకులను హెచ్చరిస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాగులో గుంతలు గురించి వివరించారు. ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య కేంద్ర నిర్మాణం

●ఐదేళ్లుగా సా..గుతున్న నిర్మాణ పనులు

తిరుపతి అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం మంగళం పరిధిలోని రణధీరపురం పంచాయతీలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్ర నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. చుట్టుపక్కల ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం రణధీరపురం పంచాయతీలో 2019 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 17.5లక్షలు మంజూరయ్యాయి. 2020 ప్రారంభంలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే అదే ఏడాది కరోనా వ్యాప్తి చెందడంతో ఎక్కడి కార్యకలాపాలు అక్కడ స్తంభించిపోయాయి. ఏడాది తర్వాత పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రూ.13లక్షలతో 70 శాతం పనులను కాంట్రాక్టర్ పూర్తి చేశాడు. బిల్లుల విడుదలలో జాప్యం కారణంగా మిగిలిన పనులు పూర్తి చేయకనే తప్పుకున్నాడు. ఏడాదిన్నర కాలంగా ఆ భవనం అసంపూర్తిగానే ఉంటోంది. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్, తలుపులు, కిటికీలు, సున్నం వంటి ఫినిషింగ్ పనులు చేయాల్సి ఉంది. ఈ భవనంతో పాటు ప్రారంభమైన సచివాలయం, ధ్యాన, సమావేశ మందిరాల నిర్మాణం పూర్తి చేసుకుని ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. ఆ ప్రాంగణంలో ఈ భవనం ఒక్కటే అసంపూర్తిగా దర్శనమిస్తోంది. సచివాలయానికి వచ్చే ప్రజలు ఇది ఎప్పుడు పూర్తవుతుందోనని నిట్టూరుస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


పూర్తి కాని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం

భక్తులకు అందుబాటులో లాకర్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-3(పీఏసీ)లో కేంద్రీయ లాకర్ కేటాయింపు కౌంటర్లను టీటీడీ ఈవో శ్యామలరావు అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పీఏసీ-3లో లాకర్ కేటాయింపునకు మూడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ 1,420 లాకర్లు అందుబాటులో ఉంటాయి. ప్రారంభానంతరం ఈవో, అదనపు ఈవో భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. పీఏసీ-5 భవన నిర్మాణాన్ని పరిశీలించారు. వెంగమాంబ అన్నప్రసాద కేంద్రానికి చేరుకుని డోనార్ సెల్‌ను పరిశీలించారు. అంతకు ముందు పాపవినాశనం చేరుకుని మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కును పరిశీలించి సూచనలు చేశారు. టోల్‌గేట్ వద్ద టోల్ రశీదులను తనిఖీ చేశారు. ఆకాశగంగ మెట్ల మార్గంలో భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా దుకాణాల ఆక్రమణలను తొలగించాలన్నారు. తనిఖీల్లో సీఈ సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, సుధాకర్, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డెప్యూటీ సీవీఎ్‌సవో శ్రీనివాస్, డిప్యూటీఈవో ఆశాజ్యోతి, రాజేంద్ర, శాస్త్రి పాల్గొన్నారు.


లాకర్‌ను పరిశీలిస్తున్న ఈవో,అదనపు ఈవో

ఎంసీబీలతో విద్యుత్ ప్రమాదాలకు చెక్

●ఈపీడీడీసీఎల్ ఎస్‌ఈ పాలడుగు సురేంద్రనాయుడు

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు ఎంసీబీలు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నుంచి బయట పడవచ్చునని ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ పాలడుగు సురేంద్రనాయుడు సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు ఫీజు క్యారియర్ కెపాసిటీపై అవగాహన పెంచుకోవాలన్నారు. కెపాసిటీ కన్నా ఎక్కువ మోతాదులో ఫీజు వేయడం వలన సమస్యలు తలెత్తున్నాయన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్, సబ్‌స్టేషన్‌పైన విద్యుత్ అధిక భారం పడుతోందన్నారు. అలాంటప్పుడు టాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవుతోందన్నారు. నాణ్యమైన మోటార్లను వాడాలన్నారు. మోటార్లలో విద్యుత్ సరఫరా జరిగే చోట ఎంసీబీలు ఏర్పాటు చేస్తే ప్రమాదం తప్పుతుందన్నారు. ఏదైనా జరిగితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. రైతులు ప్రమాదాల నుంచి బయటపడతారని వివరించారు.


సురేంద్రనాయుడు

మా ఊరికి దారేదీ..

● కంచె వేయడంతో అవస్థలు

పాకాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి దారి లేకపోవడంతో 17 రోజులుగా గెరికెనెట్టు గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఈ ఊరిలో 13 ఇళ్లు ఉన్నాయి. గ్రామానికి వెళ్లడానికి మొగరాల - మద్దినాయనిపల్లె తారు రోడ్డు నుంచి 100 మీటర్ల పొడవున 45 యేళ్లుగా దారి ఉండేది. ఈ నెల 5న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దారి తమ పట్టా స్థలమని కంచె వేశారు. దీంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పెద్దలతో సంప్రదించినా ఫలితం లేకపోవడంతో గత శనివారం వీరు తహశీల్దార్ నిత్యానందబాబుకు విన్నవించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


దారిలో అడ్డంగా వేసిన కంచె

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు: ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, నవంబరు22, ఆంధ్రజ్యోతి: తమ నియోజకవర్గ అభివృద్ధికి ఇతోధికంగా సహాయం అందించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. శుక్రవారం విజయవాడలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పాకాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చాలన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తావించిన సమస్యలను ఆయనకు నివేదిక రూపంలో వివరించామన్నారు. రహదారులు, కాజుకాజ్‌వేల మరమ్మతులకు అంచనాలు రూపొందించామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద మొత్తంలోని నిధులు అవసరమని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు నాని వివరించారు.


ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఘనంగా తిరువీధి ఉత్సవం



తిరుచానూరు, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి అభిషేకం చేశారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ నిర్వహించారు. మధ్యాహ్నం కేటీ మండపంలో ఉత్సవర్లకు నేత్రపర్వంగా తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అలంకార శోభితురాలైన పద్మావతి దేవి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు ప్రసాద్, భాస్కరనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలు పరిష్కరించండి: ఎస్‌ఎఫ్‌ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని ఎస్వీయూ వీసీ అప్పారావును ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సుస్మిత కోరారు. పీరియడ్స్ సమయంలో రెండు రోజుల సెలువులు, నాప్‌కిన్స్ ఉచితంగా ఇవ్వాలని, మరుగుదొడ్లు, స్టడీ రూములు బాగుచేయాలని కోరారు. ఈ అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


కుమారమ్మను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి (జీవకోన), నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పురిమెట్ల కుమారి (కుమారమ్మ) మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీర్తి, దంపూరి భాస్కర్‌యాదవ్, మునిశేఖర్‌రాయల్ పాల్గొన్నారు.

వెటర్నరీ ఉద్యోగ సంఘ ఎన్నికల్లో ద్విముఖ పోరు

● 20నామినేషన్ల దాఖలు

●బరిలో 18మంది అభ్యర్థులు

తిరుపతిరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం శుక్రవారం మధ్యాహ్నంతో ముగిసింది. ఈ ఎన్నికల్లో పోటీకి మొత్తంగా 20మంది నామినేషన్లు దాఖలు చేయగా..ఇద్దరు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో తుదిగా ఒక్కోప్యానల్‌లో 9మంది అభ్యర్థుల చొప్పున రెండు ప్యానల్స్‌లో కలిపి 18మంది బరిలో ఉన్నారని వర్సిటీ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు మీడియాకి వెల్లడించారు. ఈఎన్నికల్లో ప్రధాన పోస్టులైన అధ్యక్ష పదవికి సి.నాగరాజు, కె.వెంకటేశ్‌బాబు బరిలో నిలిచారు. ప్రధానకార్యదర్శి పోస్టుకి కార్తీక్, కరీముల్లా పోటీలు ఉన్నారు. వీరితోపాటు ఇతర పోస్టులకు అభ్యర్థులు పోటీకి నిలబడ్డారు. శనివారం వెటర్నరీ కళాశాల కమిటీహాలులో సమావేశం నిర్వహించి పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితా ప్రకటించడంతోపాటు గుర్తులను కేటాయిస్తారు. వర్సిటీలో అటెండర్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులు 166మంది ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొననున్నారు. వీరిలో రాయలసీమ జోన్‌లో 117మంది, కోస్టల్ ఆంధ్రా జోన్‌లో 49మంది కలిసి మొత్తం 166మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా ఉద్యోగులసంఘ బైలాలో అధ్యక్ష పదవికి తిరుపతి కేంద్రంగా కనీసం రెండేళ్లు పనిచేసే ఉద్యోగులు పోటీచేయాలన్న మార్గదర్శకాల ప్రకారమే అభ్యర్థులు పోటీలో నిలిచారు. వచ్చేనెల7న జరిగే ఎన్నికలకు అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల వితరణ

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మాధురి గోల్డ్ నిర్వాహకులు క్రీడాసామగ్రి అందజేశారు. హాకీ స్టిక్స్, టేబుల్ టెన్నిస్ కిట్లు, వాలీబాల్, బాస్కెట్ బాల్ తదితరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ

రేణిగుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాత చెక్‌పోస్టు సమీపంలోని ఆర్‌సీఎం హైస్కూల్ విద్యార్థులకు సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష, సర్పంచు నగేష్, ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తిలో ఆక్రమణలపై కొరడా


సన్నిధి వీధిలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాకపోకల అంతరాయానికి కారణమవుతున్న ఆక్రమణలపై అధికారులు కొరడా ఝులిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సన్నిధి వీధిలోని జలవినాయక కూడలినుంచి టూరిస్టు బస్టాండు వరకు రోడ్డు అత్యంతంగా ఇరుగ్గా మారింది. ఆలయం మూడో గేటు, నాల్గో గేటు వద్ద నిత్యం వాహనాలు స్తంభించిపోతున్నాయి. ఇక్కడ ఆక్రమణలతో రోడ్డు కుచించుకుపోయింది. పది రోజుల క్రితం రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందిగా పోలీసు, పురపాలకసంఘ అధికారులు సంయుక్తంగా వ్యాపారులకు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్ర వారం వేకువ జామున యంత్రాలతో అధికారులు రంగంలోకి దిగారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, 1టౌన్ సీఐ గోపి, సిబ్బందితో సన్నిధివీధిలో రోడ్డుపైకి చొరబడ్డ ఆక్రమణలను తొలగించారు. ఎక్కడా వివక్షకు తావులేకుండా అధికారులు జల వినాయక కూడలి నుంచి టూరిస్టు బస్టాండు వరకు దగ్గరుండి ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. ఇక సాయంత్రం డీఎస్పీ నరసింహమూర్తి,సీఐ గోపి వైఎస్‌ఆర్ కూడలి వద్ద బాబుఅగ్రహారం కోనేరు పరిసరాలు, ఆర్టీసీ కూడలి నుంచి శివపార్వతుల కూడలి వరకు నడుచుకుంటూ ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డుపైకి చొరబడ్డ వారికి తొలగించాల్సిందిగా సూచనలు ఇచ్చారు.

పరశురామేశ్వరుడి సేవలో మహారాష్ట్ర సీఎం తనయుడు



ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ శిండే తనయుడు శ్రీకాంత్ శిండే దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, మాజీ సర్పంచ్ పద్మనాభనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు అడవిలో ఇళ్ల స్థలాలా..?

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న చింతామోహన్

తిరుపతి(వైద్యం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలో ఉన్నప్పుడు బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో వేలకోట్లతో ప్యాలెస్‌లు కట్టించుకొని టీటీడీ ఉద్యోగులకు మాత్రం పుత్తూరు సమీపంలోని అడవుల్లో ఇళ్ల స్థలాలు కేటాయించడం ఎంత వరకు న్యాయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ప్రశ్నించారు. టీటీడీ పరిపాలనా భవనం ముందు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అలిపిరి నుంచి పేరూరుకు వెళ్లే మార్గంలో ఉన్న 400 ఎకరాల టీటీడీ భూములను టీటీడీ ఉద్యోగులకు 5 సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇస్తామన్నారు. స్విమ్స్‌లో నిరుపేదలకు పూర్తి ఉచిత వైద్యం అందించాలని కోరారు. అలిపిరి రోడ్డులోని దివ్యారామాన్ని పూర్తిచేయాలని కోరారు. ఇక స్థానికులకు ప్రతినెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి తేజోవతి, మునిశోభ, వెంకటేష్ గౌడ్, రావణ్, నరేంద్రబాబు నాయుడు, చందనమూడి శివ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాల యాత్ర ప్రారంభం


ప్రయాణికులతో బయలుదేరుతున్న బస్సు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాల క్షేత్ర సందర్శనకు 36 మంది భక్తులు శుక్రవారం తరలివెళ్లారు. సెంట్రల్ బస్టాండులో మధ్యాహ్నం ఒంటిగంటకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరింది. నెల్లూరు, గుంటూరు, విజయవాడ మీదుగా సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతికి వెళ్లనున్నారు. ఆదివారం ఉదయం తిరుపతికి చేరుకోనున్నారు. తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు పేర్కొన్నారు. స్టూడెంట్ అండ్ కల్చరల్ అఫైర్స్ - హెల్త్ సెంటర్ సంయుక్తంగా మహిళల ఆరోగ్యంపై శ్రీనివాసా ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తర్వాత గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాక్సిన్ ప్రతి మహిళా తీసుకోవాలన్నారు. డెర్మటాలజిస్ట్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ చర్మ వ్యాధులను శుభ్రతతో అధిగమించవచ్చని తెలిపారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి లక్ష్మి మాట్లాడుతూ స్వీయ రక్షణ వ్యూహాలతో, ఆత్మ విశ్వాసంతో, ఉత్సాహంగా విద్య, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. వర్సిటీ జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ పౌష్టికాహారం, శారీరక వ్యాయామం, శుభ్రత ద్వారా అనేక వ్యాధులను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, విద్యార్థినులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి


మీడియాతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

తిరుపతి (ఆటోనగర్) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కనకదుర్గా దివ్యాంగ సొసైటీ అధ్యక్షుడు జి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగుల కోటా మేరకు నియామకాలు చేపట్టలేదని, వెంటనే చేపట్టాలని కోరారు. పింఛన్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి పాస్‌లు, ఇంటి స్థలం లేనివారికి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కోదండ, దేవరాజులు, శరత్‌బాబు, చరణ్‌కుమార్ పాల్గొన్నారు.





ఆటోనగర్‌లో అడుగుపెడితే అంతే!

ఎటుచూసినా గుంతల రోడ్లు, చెత్తకుప్పలు, మురుగునీటి ప్రవాహాలు





తిరుపతి(వైద్యం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎటుచూసినా చెత్తకుప్పలు, దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీటి ప్రవాహాలతో కనిపించే ఆటోనగర్‌లో అడుగు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లపై మడుగులను తలపించేలా మురుగునీరు చేరి ఇబ్బందికరంగా దర్శనమిస్తున్నాయి. మరమ్మతుల నిమిత్తం వచ్చే వాహనాల నుంచి తొలగించిన వ్యర్థాలు, చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాలువలు చెత్తాచెదారంతో నిండి మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోడ్లు భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. గుంతల రోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.











చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని జిల్లా క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుపతి క్రైం డీఎస్పీ రమణకుమార్ కథనం మేరకు.. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఆర్టీవో కార్యాలయానికి ఎదురుగా వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయం ఉంది. ఈ నెల 15వ తేదీన ఆ కార్యాలయ యజమాని సురేష్‌కుమార్ మధ్యాహ్నం భోజనం చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో ప్రకాశం జిల్లా సోమరాజుపల్లికి చెందిన గురువిళ్ల అప్పలనాయుడు కార్యాలయంలోకి చొరబడ్డాడు. రూ 8 లక్షలు చోరీచేశాడు. బాధితుడు తిరుపతి క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా రేణిగుంట రోడ్డులోని సాయి నిర్మలా కళ్యాణ మండపం వద్ద కాపు కాచి నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.6 లక్షలు నగదు, దొంగతనానికి వాడిన స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడిపై సింగరాయకొండ, ఒంగోలు, టంగుటూరు, తెలంగాణాలోని ఎస్ఆర్ నగర్, విశాఖలోని అరిలోవ, మువ్వలవానిపాలెం, గాజు వాక, ద్వారకా తిరుమల తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదై ఉన్నాయి.



తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

ప్రతిభ కనపరచిన పోలీసులకు రివార్డులు

ఈ కేసులో ప్రతిభ కనపరచిన క్రైం సీఐ ప్రకాష్ కుమార్, ఎస్ఐ శుభన్‌నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు రవికుమార్, మురళి, రమేష్, గోపికృష్ణ, వినాయక, రాజశేఖర్, సిబ్బంది నాగరాజు, మోహన్, ప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు. వారికి నగదు రివార్డులు అందజేశారు.

నేడు ఔషధ నిపుణుల ర్యాలీ


మాట్లాడుతున్న రంగనాయకులు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మందుల వినియోగంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ఔషధ నిపుణులతో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆ అసోసియేషన్ తిరుపతి శాఖ అధ్యక్షుడు డాక్టర్ డి.రంగనాయకులు వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, శ్రీనివాస చరణ్, పి.ప్రకాష్, దుర్గాప్రసాద్ సాయి కోటేశ్వర శర్మ, బాలాజి పాల్గొన్నారు.

జార్జియాలో రోడ్డున పడ్డ ఎంబీబీఎస్ విద్యార్థినులు

కాపాడాలని వేడుకున్న ఓ తండ్రి


ఆనందరెడ్డి

తిరుపతి (ఆటోనగర్)నవంబరు22(ఆంధ్రజ్యోతి): జార్జియా దేశంలో వైద్య విద్య అభ్యసిస్తూ అక్కడి హాస్టల్లో ఉంటూ ప్రస్తుతం రోడ్డున పడ్డ తన కుమార్తెతో పాటు 60 మంది విద్యార్థినులను రక్షించాలని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి వై.ఆనందరెడ్డి కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమార్తె వై.జ్యోతికశ్రీప్రియను వైద్య విద్య కోసం జార్జియాలోని ఇలియా యూనివర్సిటీలో చేర్పించామన్నారు. వసతి కోసం హ్యాపీ లివింగ్ ప్రైవేటు హాస్టల్లో చేర్చామన్నారు. ఎనిమిది నెలలకు గాను ఫీజు రూ.1,20,000లు చెల్లించామన్నారు. రెండు నెలలు అనంతరం హాస్టల్ లీజు దారుడు కమ్రాన్ పరారయ్యాడని తెలిపారు. దీంతో హాస్టల్ భవన యజమాని హాస్టల్లోని 60 మంది విద్యార్థినులను బయటకు పంపారని పేర్కొన్నారు. వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు జరిగిన అన్యాయాన్ని ఆదేశంలోని ఇండియన్ ఎంబసీకి తెలియజేశారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి వారిని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత సీకాం


వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచి కప్ స్వీకరిస్తున్న సీకాం కాలేజీ జట్టు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ అంతర కాలేజీ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సీకాం కాలేజీ జట్టు నిలిచింది. ఈ నెల 18 నుంచీ వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించగా 26 జట్లు పాల్గొన్నాయి. ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో తిరుపతి, కలికిరి సీకాం కాలేజీ జట్లు తలపడ్డాయి. తిరుపతి సీకాం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు విజేత జట్టుకు మెడల్స్, సర్టిఫికెట్, ట్రోఫీని అందజేసి అభినందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో సీకాం కాలేజీ విద్యార్థుల ప్రతిభను వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు. సీకాం కాలేజీ చైర్మన్, ఎస్వీయూ ఈసీ సభ్యుడు డాక్టర్ టి.సురేంద్రనాథరెడ్డి, సీకాం డైరెక్టర్లు ప్రణీత్ స్వరూప్, తేజ స్వరూప్ ఆధ్వర్యంలో సీఎం కాలేజీ జట్టే అత్యధిక సార్లు విజేతగా నిలవడం పట్ల అభినందనలు తెలిపారు.

చెత్తకుప్పలు కనిపిస్తే కఠిన చర్యలు : కమిషనర్

తిరుపతి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల పక్కన, వీధుల్లో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే సంబంధిత సిబ్బందిపైన కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను హెచ్చరించారు. నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది విధులపై శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో శానిటరీ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఆయా వార్డుల్లో మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు ఏ మేరకు పారిశుధ్య పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పనులు సక్రమంగా నిర్వహించకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు ఐదు వార్డులకు ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నామన్నారు. నగరంలోని చెత్త మొత్తం తూకివాకానికి తరలించాలన్నారు. నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధించాలన్నారు. సమావేశంలో ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


సీపీఎం సభల గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్) నవంబరు22 (ఆంధ్రజ్యోతి) సత్యవేడులో డిసెంబరు1, 2 తేదీల్లో నిర్వహించే సీపీఎం 14వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక యశోదనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు భాస్కర్, కందారపు మురళి, జయచంద్ర, సాయి లక్ష్మి, పుల్లయ్య, టి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల క్రికెట్ జెర్సీ ఆవిష్కరణ


న్యూజెర్సీ ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో

తిరుపతి(క్రీడలు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల క్రికెట్ జట్టు జెర్సీని శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు ప్రారంభించారు. ఖాళీ సమయంలో ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలని, తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎంప్లాయీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షులు చీర్ల కిరణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి నాదముని, రమేష్, అజయ్, రవికుమార్‌రెడ్డి, ఇళయరాజ్, ఈశ్వర్‌నాయక్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆయన లోకమే వేరు

పీకల దాకా తాగాడు. మత్తు తలకెక్కింది. నడిరోడ్డులో పడకేశాడు. రద్దీగా ఉండే ఆ మార్గంలో వాహనాలు వచ్చి తొక్కేస్తాయన్న భయం లేదు. ఎందుకంటే ఆయన ఈ లోకంలో లేడు. గురకపెడుతూ నిద్రపోతున్నాడు. ఈ దృశ్యం పుత్తూరు పట్టణం నడిబొడ్డున హెడ్‌మాస్టర్ బావి వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌కు కనిపించింది. వాహనాలు అదుపు తప్పితే చనిపోతాడని భావించిన ఓ మానవతావాది అతన్ని రోడ్డు పక్కకు లాగి పడేశాడు.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

సంకల్ప 'బలం'

కష్టపడి బతకాలన్న సంకల్పం ముందు ఆయన వయస్సు చిన్నబోయింది. చిన్న వయస్సులో ఆసక్తితో రిక్షా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఊహ తెలిశాక దాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. 40ఏళ్లుగా రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు తిరుపతికి చెందిన 60 ఏళ్ల రామదాసు. ఈ వయస్సులోనూ రైల్వేస్టేషన్ నుంచి యాత్రికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాడు. రిక్షా తొక్కడం వల్ల వచ్చిన దాంతో ముగ్గురు కుమార్తెలను చదివించడమేగాక పెళ్లిళ్లు చేసి పంపించాడు. కుమార్తెలు తమవద్దకు రమ్మని చెబుతున్నా ఇన్నాళ్లు దారి చూపిన మార్గాన్ని వదులుకోలేక ఇప్పటికీ రిక్షా తొక్కుతున్నట్లు సంతోషంగా చెబుతున్నాడు.

- తిరుపతి, అర్బన్, ఆంధ్రజ్యోతి





భావరాగయుక్తంగా ఆయన గళం విప్పితే ప్రేక్షకులు తన్మయత్వం చెందుతారు. భక్తితత్వంలో లీనమవుతారు. దివ్యవేదాంతం మొదలు చక్కటి చిక్కటి హాస్యం పండించే తీరుకు పండితులే కాదు పామరులూ మంత్రముగ్ధులవువారు. ఆయనే హరికథకుడు ఒంటి రవి. నారాయణవనం మండలం తిరువట్యానికి చెందిన ఈయన తండ్రి ఆనందరెడ్డి రంగస్థల కళాకారుడు. తాత మునిసుబ్బారెడ్డి తుంబుర గాయకుడు. కళను వారసత్వంగా పునికిపుచ్చుకున్న రవి తెలుగుమీద మమకారంతో తిరుపతి ప్రాచ్యకళాశాలలో చదివారు. తనకు ఇష్టమైన హరికథలో విశారద పట్టా పొందారు. ఎస్వీయూ నుంచి తెలుగులో పీహెచ్‌డీ చేశారు. - పుత్తూరు (ఆంధ్రజ్యోతి)

భళా..భాగవతార్

● రచయితగా..హరి కథకుడిగా రాణిస్తున్న తెలుగు అధ్యాపకుడు రవి

ఆధునిక కాలగమనంలో ఉనికి ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన కళారూపాల్లో ఒకటైన హరికథకు ఊపిరిలూదుతున్న వారిలో రవి ఒకరు. తన కుమారుడు హరికథ నేర్చుకోవాలనేది రవి తండ్రి ఆకాంక్ష. ఈదిశగానే చిన్నప్పటి నుంచి ఆయన హరికథ వైపు మొగ్గు చూపారు. కుప్పంలో హైస్కూలులో తెలుగు పండిట్‌గ కెరీర్ ప్రారంభించారు. 59ఏళ్ల రవి ప్రస్తుతం కార్వేటినగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉద్యోగాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తూ మరోపక్క తాను అమితంగా ఇష్టపడే హరికథనూ ఏనాడూ విస్మరించలేదు. వచనాపాటవం, తెలుగు భాషాభిమానం,సందర్భోచిత హాస్య కుశలత మెండుగా ఉన్న రవి 1986లో నారాణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో రంగస్థల అరంగేట్రం చేశారు. చదువుకునే రోజుల్లో రవీంద్ర భారతి(హైదరాబాద్)లో పార్వతీకల్యాణం హరికథను వినిపించారు. ఆ సందర్భంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు అభినందన ఆయనను ప్రోత్సహించింది. శ్రీకృష్ణ పాండవీయం ప్రదర్శన డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రశంసలందుకుంది. 1996లో అవధాని మేడసాని మోహన్ నిర్వహించిన అపూర్వ పంచ సహస్ర అవధానంలో ఆయనలోని భాషాపటిమను బయటపెట్టింది. ఉత్తమ పృచ్ఛకుడి అవార్డు సొంతం చేసుకోగలిగారు. భారతం, భాగవతం, రామాయణం, శివపురాణాలను ఔపోసన పట్టిన ఆయన భాగవతార్‌గా నలభై ఏళ్లపాటు రాష్ట్రమంతా తిరిగారు. 2500 హరికథలను గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

తెలుగుకు పట్టం

ఉద్యోగ విరమణ చేశాక తెలుగుబాషాభివృద్ధికి మరింత అంకితం కావాలని సంకల్పిస్తున్నాను. వ్యాకరణాంశాలు, పద్యాలు, లేఖారచన్నదు, ఛందస్సు, అలంకారాలపై పట్టు, గానం చేయడం లాంటి అంశాల్లో ఔత్సాహికులకు ఉచితంగా శిక్షణ ఇస్తాను. భారతం, భాగవతం, రామాయణం లాంటి ఇతి హాసాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. ప్రాథమిక పాఠశాలలో తెలుగుకు పట్టం కట్టాలి.

- ఒంటి రవి

రచయిత కూడా.. : రవి హరికథకుడే కాదు మంచి రచయిత కూడా. 2023 శ్రీసిటీలో ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీవెంకటేశ్వర శతకం, వేదనారాయణ శతకం, అక్షర తపస్మాన్ గీతాలు, భాషా కవితల రచనలు చేశారు. రెండు పెదవులు దగ్గరకు చేరుకుండా పలికే పద్య రచన చేయడం ఆయన విశిష్టత. హావ భావ నటన వైదుష్య, హరికథాసుధానిధి, పండిత కవి వంటి 15 పురస్కారాలను పొందారు. సంగీతసాహిత్యాలతోపాటు అభినయపూర్వకంగా భక్తిని, విజ్ఞానాన్ని,వినోదాన్ని ప్రదర్శించడంతో దిట్టగా పేరు సంపాదించారు.

కొండలా పేరుకున్న చెత్త

● ఐదేళ్లుగా వ్యర్థాల ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం



డంప్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

● సమస్యపై టీటీడీ చైర్మన్ ఫోకస్ ● మూడు నెలల్లో తొలగిస్తాం : ఈవో

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా తిరుమలలో మరో కొండను తలపించేలా చెత్త పేరుకుపోయింది. ఇక్కడి పర్యావరణానికి నష్టం కలిగేలా తయారైంది. పచ్చని చెట్ల మధ్య సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా రోజూ తడిచెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు సేకరిస్తున్నారు. దీనిని గోగర్భం డ్యాం సమీపంలోని డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి, మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్టులు ఉండే ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. పొడిచెత్తను కూడా వేరు చేసి పునర్వినియోగం చేయదగిన వాటిని తరలించాల్సి ఉంటుంది. గత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి తరలించడంలో కూడా విఫలమాయ్యారు. కంపోస్టు కేంద్రంలో సక్రమ నిర్వహణ జరగలేదు. వచ్చిన చెత్తంతా కుప్పగా పోస్తూ వచ్చారు. దీంతో కొండను తలపించేలా వ్యర్థాలు పోగుబడ్డాయి. ప్రాసెసింగ్ కాంట్రాక్ట్ ఎంపికలోనూ సిఫార్సులు, కమీషన్ల కక్కుర్తి కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని సమాచారం. సాధారణంగా 70 టన్నుల చెత్త వచ్చే ప్రాంతం కనీసం మూడెకరాలైనా ఉండాలి. కానీ తిరుమలలోని డంప్‌యార్డ్ ప్రదేశం ఒకటిన్నర ఎకరా మాత్రమే. ఫలితంగా చెత్త గుట్టలుగా మారిపోయాయి. ఈ క్రమంలోనే టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తొలి ప్రాధాన్యతగా డంప్‌యార్డ్‌పైనే దృష్టిపెట్టారు.

పరిశీలించిన టీటీడీ ఈవో

తిరుమలలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గోగర్భం డ్యాంకు సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. లోపాలను గుర్తించి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. చెత్తను కుప్పగా వేసేందుకు కాంట్రాక్ట్ సంస్థలు ఎందుకంటూ ఆగ్రహించారు. చెత్త విభజనలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఇలా కొనసాగితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై తిరుపతి మున్సిపాలిటీ అధికారులతో చర్చించామన్నారు. భవిష్యత్తులో శాస్త్రీయంగా డంపు చేసే విధానం అమలు చేస్తామన్నారు.



దంప్‌యార్డ్‌లో పేరుకున్న చెత్త



సినిమా చూస్తున్న గల్లా దంపతులు

సనాతన ధర్మం తెలిపే 'దేవకీనందన వాసుదేవ'

మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

తిరుపతి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన మనవడు అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' చిత్రం సనాతన ధర్మాన్ని తెలియజేసేలా ఉందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. గల్లా అశోక్ హీరోగా నటించిన రెండో చిత్రం దేవకీనందన వాసుదేవ సినిమా శుక్రవారం విడుదలైంది. గల్లా అరుణకుమారి, ఆమె భర్త గల్లా రామచంద్రనాయుడు మధ్యాహ్నం కృష్ణతేజ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి తిలకించారు. మనవడి నటన ప్రావీణ్యాన్ని చూసి సంబరపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అశోక్ హీరో కావడానికి చాలా కష్టపడ్డాడని, వెండితెరపై అద్భుతమైన నటనతో మరోసారి నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు చూడదగ్గ సినిమా అన్నారు. అంతకుముందు థియేటర్ వద్ద బాణసంచా పేల్చుతూ అభిమానులు వారికి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, గిరిజ, ఊకా విజయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, మునినాదం, బాబ్జి తదితరులు సినిమా వీక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,803 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,930 మంది తలనీలాలు సమర్పించారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

బీవీఎస్సీ కోర్సులో వందశాతం సీట్లతో భర్తీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నాలుగు బీవీఎస్సీ కాలేజీలు, 22 పాలిటెక్నిక్ కాలేజీలు, ఒక డెయిరీ డెక్నాలజీ కాలేజీల్లో ఖాళీగా ఉన్నట సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. బీవీఎస్సీకి సంబంధించిన 270 సీట్లు ఖాళీగా ఉండగా, 270 మందితో భర్తీ చేశారు. ఈ కోర్సుకు సుమారు 5 వేల మంది దరఖాస్తు చేశారు. అలాగే 10 ప్రభుత్వ, 12 ప్రైవేట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 990 సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. ఈ కోర్సుల్లో 690 మంది విద్యార్థులు చేరారు. డెయిరీ టెక్నాలజీ కాలేజీలో ఖాళీగా ఉన్న 28 సీట్లకు 26 మంది విద్యార్థులు చేరారు. మార్చిలో ఎంవీఎస్సీ పీహెచ్‌డీ కోర్సులకు నోటిఫికేషన్ వెలువరించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ) చెంగల్రాయులు తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యం

సత్యవేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళంలో తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన మునిశేఖర్ భార్య హేమావతి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి తన కూతురు చిన్నారి నయనికను తీసుకుని గురువారం ఉదయం వెళ్లింది. రాత్రి ఇంటికి రాలేదు. మునిశేఖర్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తి కళాకారులు

శ్రీకాళహస్తి, నవంబరు 22: ఢిల్లీలో శుక్రవారం ప్రారంభమైన ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు కళాకారులు పాల్గొంటున్నారు. కొయ్యబొమ్మల కళాకారుడు గుమ్మడిపూడి దశరథాచారి, కలంకారి కళాకారుడు సుధీర్‌లకు అవకాశం లభించింది. తోలుబొమ్మల కళాకారుడు కుల్లాయప్పకు అవకాశం దక్కింది. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్ మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. కేంద్ర జౌళి శాఖ మంత్రి పవిత్రా మార్గరీటా శుక్రవారం దీన్ని ప్రారింభించారు. కొయ్యబొమ్మలు, కలంకారీ కళా ఉత్పత్తుల స్టాల్స్ ఇందులో ఏర్పాటు చేశారు. దేశ, విదేశీ కళాప్రియులు వీటిని సందర్శిస్తున్నారు. నిమ్మలకుంటకు చెందిన తోలుబొమ్మల కళాకారుడు కుల్లాయప్ప కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.



ఢిల్లీ ప్రదర్శనలో సందర్శకులతో శ్రీకాళహస్తికి చెందిన హస్తకళాకారుడు గుమ్మడి దశరథాచారి

లెక్క తేలుతోంది..!

● 34 అపార్టుమెంట్లకు పన్నుల తగ్గింపు
● ఇష్టారాజ్యంగా టెండర్ల ప్రక్రియ

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలను వెలికితీసే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని ప్రాథమికంగా విచారణ కమిటీ గుర్తించింది. ఇదివరకు ఆడిట్ కమిటీ నిగ్గుతేల్చిన అంశాలే విచారణ కమిటీకి బ్రహ్మాస్త్రంగా మారినట్టు తెలుస్తోంది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఎ) విచారణకు సిద్ధమయ్యారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. వారం రోజులుగా కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌తో పాటు అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబులపై లోతైన విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారంతో విచారణ పూర్తిచేసుకుని మరో వారంలో నివేదిక సిద్ధ చేసేపనిలో విచారణ బృందం కసరత్తు చేస్తోంది. రెవెన్యూ, పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించారు. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం, లేని అధికారులు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ గుర్తించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డులో నమోదు చేసిన వాటికి చాలా వ్యత్యాసం ఉన్నట్టు సమాచారం. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు తెలిసింది. దాదాపు 34 అపార్టుమెంట్లను పరిశీలిస్తే 250కు ఫ్లాట్లకు ఇష్టారాజ్యంగా పన్నులు తగ్గించి వేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలోనూ గత డీజీ విజయకుమార్ రెడ్డిపై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు కార్పొరేషన్ కార్యాలయం నుంచి పలు రికార్డులు తెప్పించుకుని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చేయని పనులకు కూడా చేసినట్టు చూపించారని, కోట్లలో అవినీతి జరిగిందన్న అరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం

తిరుచానూరు, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈనెల 27న ఆలయంలో లక్ష కుంకుమార్చన జరగనుంది. 28న జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ఈ వేడుకలకు సంబంధించిన పనులను టీటీడీ అధికారులు వేగవంతం చేశారు.

వాహన సేవలు ఇలా..

28వ తేదీ: ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్నశేష వాహనం
29 : ఉదయం పెద్దశేషవాహనం, రాత్రి హంస వాహనం
30 : ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం
డిసెంబరు 1 : ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం
2: ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం వసంతోత్సవం
3: ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గరుడ వాహనం
4: ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం
5: ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం
6: మధ్యాహ్నం పంచమీతీర్థం, రాత్రి ధ్వజావరోహణం
7: సాయంత్రం పుష్పయాగం.

సేవాభావంతో రైతులకు సేవలందించండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది రైతులకు సేవాభావంతో సేవలందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు హెచ్చరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. రబీలో ఈ-పంట నమోదులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సాంకేతికత అధికారి హరిత వివరించారు. పంట, బీమా, పీఎం కిసాన్ గురించి సరళ, గాయత్రి సిబ్బందికి వివరించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ వివరించారు. వరి సాగులో పరిమితంగా రసాయనాల వినియోగంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధిపతి డాక్టర్ మురళీకృష్ణ రైతులకి శిక్షణ ఇచ్చారు. సిబ్బందితోపాటూ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కళాశాల ఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు వేణుగోపాలరావు, శ్రీనివాస్, శశికళ పాల్గొన్నారు.

ప్రహరీ కూలి ఒకరి మృతి

● ఐదుగురికి గాయాలు



గాయపడిన కూలీలు - మృతి చెందిన రానా

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర కాలనీ సమీపంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రహరీ గోడ కూలి ఒకరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సుధాకర్‌రెడ్డికి చెందిన స్థలంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇందులో ఒడిశా కూలీలు పనిచేస్తున్నారు. 15 అడుగుల గొయ్యి తవ్వి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. శుక్రవారం ఉదయం కూలీలు గోడ పక్కన ఇసుక పోస్తుండగా ప్రహరీ గోడ కూలిపోయింది. రాజు, రమేష్, చాన్‌బాబు, స్వాతినాయక్, సత్యనారాయణశర్మ, కొల్లాకరన్ రానాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కొల్లాకరన్ రానా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం



హావెల్స్-లాయిడ్ పరిశ్రమను సందర్శించిన జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన జాగృతి యాత్ర బృంద సభ్యులు 500 మంది శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఇందులో అమెరికా, యూరప్‌కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు. బృంద సభ్యులు రోల్ మోడల్‌గా ఎంచుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు రవీంద్ర సన్నారెడ్డి వివరణ ఇస్తూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తాము ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు డైకిన్, హ్యావెల్స్, ఈప్యాక్, బాల్ కార్పొరేషన్, థెర్మాక్స్, మెక్‌విన్, జెడ్‌టీటీ, ఎంఎండీ, ఏఎల్ఎఫ్ ఇండియా, బెర్డిన్ పైప్స్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్స్, బ్రేక్స్ ఇండియా పరిశ్రమలను సందర్శించారు.

వ్యాసరాజ మఠాధిపతిని కలిసిన ఈవో



తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వ్యాసరాజ మఠాధిపతి విద్యాశ్రీశతీర్థ స్వామిజీని తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామిజీ ఈవో దంపతులకు ఆశీర్వచనం చేశారు. ఇటీవల భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని ఈవోను స్వామిజీ అభినందించారు.

భారీ వాహనాలతో రహదారి ధ్వంసం

లారీలను అడ్డుకున్న శిరసనంబేడు గ్రామస్తులు



వాహనాలకు అడ్డంగా నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెళ్లకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామం మీదుగా వెళ్తున్న భారీ వాహనాలతో రహదారి అడుగడునా గుంతలు పడి ధ్వంసం అయింది. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం లారీలను అడ్డుకున్నారు. శిరసనంబేడు సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామాలని అవతల నిర్మించిన బైపాస్ రోడ్డు ధ్వంసం అయింది. దీంతో గురువారం రాత్రి ముళ్లకంప రోడ్డుపై వేసి తగలపెట్టారు. శుక్రవారం వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పరిశ్రమ యాజమాన్యం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలసి ఘటనను వివరించారు. ముందు రోడ్డును అభివృద్ధి చేయాలని పరిశ్రమ యాజమాన్యానికి నెలవల సూచించారు. ధ్వంసమైన రహదారిని వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని యాజమాన్యం అంగీకరించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

మడుగులా రహదారి



దొరవారిసత్రం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కల్లూరుకండ్రిగ గ్రామం వద్ద సూళ్లూరుపేట - వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి నీటి మడుగులా ఉంది. వర్షాలకు పంట పొలాల్లో పడిన నీరంతా రహదారి పైకి వచ్చి నిల్వ చేరింది. వర్షపు నీరు తూర్పు వైపున పొలాల వైపు ప్రవహించాల్సి ఉంది. అయితే రహదారి లోతట్టు ప్రాంతం కావడంతో రోడ్డుపైన నిల్వ ఉండిపోయి మడుగులా మారింది. నీరు నిల్వచేరిన చోట పాచిపట్టిపోవడంతో పాటు రోడ్డుపై రెండు చోట్ల గోతులు ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ మోటారు సైకిల్ ప్రమాదానికి గురై ప్రయాణికుడికి చెయ్యి విరిగింది. అధికారులు స్పందించి రోడ్డుపై నీళ్లు నిల్వలేకుండా చేయడంతో పాటు, గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

వెంకటగిరి టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరినాథ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శుక్రవారం వెంకటగిరిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండలంలో జరిగిన సమావేశంలో హరినాథ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలు పరుస్తున్నారని, ఇచ్చిన వాగ్దానాలను సైతం అమలుపరచడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున పోరాడి సాధించిన జీవోలను సైతం అమలు చేసేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈనెల 26న దేశ వ్యాప్తంగా 500 కలెక్టరేట్‌ల వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి, రాష్ట్రంలో ప్రజా సంఘాలు కలిసి నిర్వహిస్తున్నా పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, గురవయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, శివకుమార్, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, మురళి, మల్లికార్జున్, రంగయ్య, జాన్, మునీంద్ర, శివ, రాజయ్య, మణి, వెంకటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

చిల్లకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను చిల్లకూరు మండల నాయకులు కోరారు. శుక్రవారం వారు అమరావతిలో ఎమ్మెల్యేను కలిశారు. వరగలి గ్రామంలో రూ. 3కోట్లతో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నిర్మించారని, ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వసతి గృహంలో ఎస్సీ బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు మూగ శంకరయ్య, నెలటూరు చిరంజీవి, సతీష్‌యాదవ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్ చవట గిరిజన కాలనీలోని గిరిజనులకు శుక్రవారం రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర డ్రైవింగ్ స్కూల్ వాసు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం చలికాలం కావడంతో పేద గిరిజనులు చలి నుంచి ఉపశమనం పొందేందుకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు రవీంద్రరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ధనుంజయరెడ్డి, సనత్‌రెడ్డి, బలరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరం

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని అన్ని బీఎల్‌వో కేంద్రాల వద్ద శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు, చేర్పులను సరిచేసుకోవచ్చునని తెలిపారు.

29న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు శుక్రవారం తెలిపారు. పలు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, డిప్లమోలో ఉత్తర్ణులైన యువతీ, యువకులు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరత్‌నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, ఆర్ముగం నగర్, దర్గారోడ్డు, రాజగోపాలపురం, శ్రీరాంనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శివశంకర్ తెలిపారు.





బాపూజీ వీధి, బజారు వీధిలో లో రోడ్డుపైనే నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు

పార్కింగ్... పరేషాన్

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో రాకపోకలు సాగించాలంటే సాహం చేయాల్సి వస్తోంది. ఏళ్లుగా ట్రాఫిక్ చిక్కుముడి వీడక రోజూ పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో దశాబ్దాలుగా సూళ్లూరుపేటను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. వెరసి పట్టణ ప్రజలు బజారు వీధుల్లో ప్రయాణమంటే నరకంగా మారింది. ముఖ్యంగా పట్టణంలో బాపూజీ వీధి, కచ్చేవి, జీఎన్‌టీరోడ్డు, పాండురంగ వీధుల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారు. దీంతో వీధుల్లో పాదచారులు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. ఉదయం వేళల్లో వినాయకుడి గుడి సెంటర్, మున్సిపాలిటీ కార్యాలయం వద్ద, కచ్చేరి వీధుల్లో నిత్యం రాకపోకలు ఇబ్బందులు తలెత్తున్నాయి. కచ్చేరి వీధిలో కూరగాయల మార్కెట్, దుకాణాలు ఉండడంతో ఆటోలు, మినీ లారీలు నిత్యం రోడ్ల పైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ పద్మవ్యూహం తప్పడం లేదు. వ్యాపార సముదాయాలే కాకుండా ఇండ్ల సంఖ్య కూడా పెరగడం పార్కింగ్ సౌకర్యాలు లేవు. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు రోడ్డుపై అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తున్నారు. పలువురు వ్యాపారులు సైతం రోడ్డును ఆక్రమించి తమ వస్తు సామగ్రి బయటపెడుతున్నారు. దీంతో మరింత కుచించుకుపోతున్నాయి. రెండేళ్ల క్రితం బాపూజీ వీధిలో ఆక్రమణలు తొలిగించి సిమెంటు రోడ్డు వేసినా ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం బజారు వీధుల్లోకి వచ్చే ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ చేసేందుకు ఎటుంటి ఏర్పాట్లు చేయకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. మున్సిపల్ అధికారులు, పోలీసులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఓవరాల్ చాంపియన్ షిప్‌లో మొదటి, రెండవస్థానంలో నిలిచిన కోట, చిల్లకూరు జట్లకు షీల్డ్‌లు అందజేస్తున్న అధికారులు

క్రీడలతో ఉజ్వల భవిత

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో ఆకుల శ్రీనివాసులు, అంబేడ్కర్ గురుకులాల నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో మూడు రోజులపాటు జరిగిన గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాలకు చెందిన 680 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీలో విన్నర్‌గా అక్కంపేట(గుంటూరు), రన్నర్‌గా వాకాడు జట్లు, ఖోఖోలో విన్నర్‌గా కోట, రన్నర్‌గా వాకాడు, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చిల్లకూరు, క్యారెమ్స్‌లో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చెన్నూరు(గుంటూరు), చెస్‌లో విన్నర్‌గా తుండూరు, రన్నర్‌గా చిల్లకూరు జట్లు నిలిచాయి. కళాశాలల బాలుర గేమ్స్‌లో చాంపియన్ షిప్‌గా కోట, గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో కోట జట్టు నిలిచాయి. అదే విధంగా పాఠశాల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా దర్శి(ప్రకాశం), రన్నర్‌గా గురజాడ(గుంటూరు), కబడ్డీలో విన్నర్‌గా వాకాడు, రన్నర్‌గా అచ్చంపేట (గుంటూరు), ఖోఖోలో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చిల్లకూరు, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా చిల్లకూరు, రన్నర్‌గా కోట, క్యారెమ్స్‌లో విన్నర్‌గా నిజాంపట్నం (గుంటూరు), రన్నర్‌గా కోట, చెస్‌లో విన్నర్స్‌గా నాయుడుపేట, రన్నర్‌గా సత్తనపల్లి (గుంటూరు) జట్లు విజయకేతనం ఎగురవేశాయి. కోట జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్‌గా సాధించగా, చిల్లకూరు జట్టు రెండవస్థానంలో నిలిచింది. ఆయా జట్లకు ఆర్ఐవో ఆకుల శ్రీనివాసులు, డిప్యూటీ డీవీఈవో మధుబాబు, డీసీవో జయలక్ష్మి షీల్డ్‌లు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఎంఈవో మస్తానయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీరేష్ పాల్గొన్నారు.

పాదిరేడు క్రాస్ వద్ద హై లెవల్ రోడ్డు నిర్మాణం కలేనా?



వడమాలపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారిలోని వడమాలపేట క్రాస్ రోడ్డు వద్ద పాదిరేడుకు హై లెవల్ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ రహదారిని ఎత్తుగా నిర్మిస్తున్నారు. దీంతో రహదారిని ఆనుకుని ఉన్న పాదిరేడు వెళ్లే రోడ్డు పల్లంగా మారింది. ఈ రోడ్డు పాపానాయుడుపేట మీదుగా శ్రీకాళహస్తికి దగ్గర దారి కావడంతో సుమారుగా 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారి ఎత్తుగా నిర్మించడంతో చెరుకు ట్రాక్టర్లు, లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఇబ్బందికరంగా మారింది. పాదిరేడు, టీసీ అగ్రహారం, లక్ష్మమ్మ కండ్రిగ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది మొత్తంలో చెరకును జాతీయ రహదారిపై చేర్చి అక్కడ ట్రాక్టర్లలో లోడు చేసుకుని ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. దీంతో అధికంగా కూలీలు చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా చిన్నపాటి లోడుతో వాహనాలు హైవే మీదకు ఎక్కలేకపోతున్నాయి. జాతీయ రహదారి మిట్ట కాడంతో ప్రయాణికులతో ఆటోలు కూడా పల్లపు రోడ్డు నుంచి హైవే మీదకు వెళ్లలేక పోతున్నాయి. ఇలా పలు గ్రామాల కు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి పాదిరేడుకు వెళ్లే రోడ్డు వద్ద సమాంతరంగా హై లెవల్ రోడ్డు నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం



పుత్తూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రా మాల్లో పారిశుద్ధ్యా నికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పుత్తూరు ఎంపీడీవో రమేష్‌బాబు, సర్పంచు వెంకటేష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం చెత్త సేకరణ నిమిత్తం పుత్తూరు మండలం తడుకు పంచాయతీకి స్వచ్ఛభారత్ నిధులు రూ.6 లక్షల ట్రాక్టరును అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దీపిక, కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గ్రామీణ రహదారులకు మహర్దశ

- సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సిమెంటు రోడ్డు భూమి పూజలో మాధవయ్య, జయశేఖర్, మోహన్ రాజు, సుధాకర్ నాయుడు, కృష్ణకుమార్, చలపతిస్వామి తదితరులు

పుత్తూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ ప్రాంతాలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టనుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. శుక్రవారం పరమేశ్వరమంగళం పంచాయతీలోని కైలాసపురం కనమిట్టలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు. గ్రామగ్రామాన సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

కానరాని 108 అంబులెన్స్ సేవలు

పుత్తూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పేద రోగులను పెద్ద ఆస్పత్రులకు తరలించే 108 అంబులెన్స్ నెలన్నర రోజులుగా అందుబాటులో లేదు. మరమ్మతుల పేరిట తిరుపతికి తరలించి ప్రత్యామ్నాయ వాహనాన్ని అందుబాటులో ఉంచకపోవడంతో ప్రాణాపాయ స్థితిలో వున్న రోగులు ఇబ్బంది పడుతున్నారు. పుత్తూరు మండలంతో పాటు పట్టణం నుంచి ప్రతి రోజు ఐదుగురు రోగులను పెద్ద ఆస్పత్రులకు తరలిస్తుంటారు. దాదాపు 80 వేల జనాభాకు ఆసరాగా వున్న ఈ వాహనం తిరుపతిలో నెలన్నర రోజులుగా మరమ్మతుల కోసం వేచి ఉంది. దీంతో పేద రోగులు అధిక మొత్తంలో అద్దెలను చెల్లించి ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. గురువారం ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి ఓ హృద్రోగిని తరలించేందుకు కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కోసం వేచి చూసి పరిస్థితి విషమిస్తుండడంతో ప్రైవేటు వాహనంలో తరలించడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. జిల్లా వైద్యాధికారులు స్పందించి 108 అంబులెన్స్‌కు త్వరితగతిన మరమ్మతులు చేపట్టి పుత్తూరులో అందుబాటులో తీసుకురావాల్సి ఉంది.

పర్యవేక్షణ కొరవడిన ఐసీడీఎస్



పుత్తూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ.. పిల్లలకు ఆటపాటలు నేర్పిస్తూ వారిలో సృజనాత్మక శక్తిని పెంపొందించే అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. ఈ కేంద్రాలకు సరఫరా అవుతున్న పౌష్టికాహారం పక్కదారి పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఎప్పటికప్పుడు కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లకు పనిభారంతో పర్యవేక్షణ తలకుమించిన భారంగా మారింది.

ఇదీ విషయం...

పుత్తూరు ఐసీడీఎస్ సీడీపీవో పరిధిలో పుత్తూరు, పుత్తూరు రూరల్, వడమాలపేట మండలాల్లో 129 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పుత్తూరు అర్బన్‌లో 43, రూరల్‌లో 43 కేంద్రాలున్నాయి. అలాగే వడమాల పేటలో 43 కేంద్రాలున్నాయి. 584 మంది గర్భిణులు, 644 మంది బాలింతలు ఉండగా, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 3,214 మంది, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు 1,824 మంది ఉన్నారు. 62 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, 26 అద్దె భవనాలు, 41 కేంద్రాలు అద్దె లేకుండా నడుస్తున్నాయి. ఈ మొత్తం కేంద్రాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఐదుగురు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల మేరకు ఒక్కో సూపర్‌వైజర్‌కు పర్యవేక్షణ కోసం 20 అంగన్‌వాడీ కేంద్రాలు కేటాయించాల్సి ఉండగా, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో ఒక్కొక్కరికి 30 కేంద్రాలను కేటాయించారు. వీరు రోజుకో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. అయితే తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. పిల్లల ఎదుగుదల, పౌష్టికాహార పంపిణీ, గర్భిణుల నమోదు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు తయారు చేయడం సూపర్‌వైజర్లకు భారంగా మారుతోంది.

రెగ్యులర్ సీడీపీవో లేక..

సీడీపీవో పద్మజ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. ఫలితంగా సిబ్బంది బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల అనారోగ్య కారణంగా ఆమె రెండు నెలల సెలవులో వెళ్లారు. రెగ్యులర్ సీడీపీవో లేకపోవడంతో ఆ బాధ్యతలను సూపర్‌వైజర్‌కు బాధ్యతలను అప్పగించారు. సూపర్‌వైజర్ స్థాయి అధికారి ఆదేశాలను సహచర సూపర్‌వైజర్లు ఎలా పాటిస్తారో తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పౌష్టికాహారం పక్కదారి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం పక్కదారి పడుతోంది. ఆహారం విషతుల్యమై చిన్నారులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు ఇటీవల జిల్లాలో కోకొల్లలు. ఆ సమయంలో హడావుడి చేస్తున్న ఉన్నతాధికారులు సమస్య మూలాల్లోకి వెళ్లడం లేదు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి టి.రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఏకోలు వేణు శుక్రవారం తెలిపారు. రాజశేఖర్ గతంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పలు అవకతవకలకు పాల్పడినట్లు అధికారులకు ఫిర్యాదులతో పాటు పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కేశవరం పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షును కొత్తపట్నం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎరువుల్లో నాణ్యత లేకుంటే చర్యలు



దుకాణంలో ఎరువులను తనిఖీ చేస్తోన్న ఏడీ నాగార్జున సాగర్

చిట్టమూరు, నవంబర్ 22(ఆంధజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులను ఇవ్వకపోతే చర్యలు తప్పవని వెంకటగిరి ఏడీ నాగార్జున సాగర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చిట్టమూరు వ్యవసాయాధికారి సుచేంద్ర ప్రసాద్‌తో కలిసి కొత్తగుంట, యల్లసిరి, మల్లాం, గ్రామాల్లో ఉన్న పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ రేటు కంటే అధిక ధరలకు మందులు విక్రయించిన, నాశిరకమైన ఎరువులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన ఖచ్చితంగా రైతులకు బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగ కాలువల నిర్మాణాలకు అటవీ అనుమతులు ఇప్పించండి: విజయశ్రీ



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలకు అవసరమైన అటవీ అనుమతులను ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం శాసనసభలోని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కలిశారు. అటవీశాఖ అడ్డంకులతో తెలుగు గంగ కాలువల నిర్మాణం పూర్తి కాలేదని, అవసరమైన అనుమతులను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి దిశగా నవ్యాంధ్రప్రదేశ్: నెలవల

నాయుడుపేట టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనా అనుభవంతో నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాలను విజయవంతంగా నిర్వహించిందన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకే క్రీడా పోటీలు



ఫుట్‌బాల్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందు క్రీడా పోటీలు దోహదపడుతాయని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫుట్‌బాల్ పోటీల్లో కావలి జవహర్‌భారతి కళాశాల జట్టు మొదటి స్థానం, కృష్ణచైతన్య కళాశాల జట్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, మణికంఠ, తిరుపాల్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ డే

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ డే జరిగింది. కళాశాల ప్రాంగణం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఎన్‌సీసీ క్యాడెట్స్ సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

ముక్కంటి సేవలో కేంద్ర క్రీడల మంత్రి



కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపం వేదోక్తంగా వెలిగించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఊంజలమండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. ఆలయ ఏఈవో హేమమాలిని, సురేష్, అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతి దేవి ఊంజల సేవ



నారాయణవనం, నవంబర్ 22: పట్టణంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసాచార్య భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

పన్ను చెల్లింపుదారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

శ్రీకాళహస్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపుదారులకు పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శ్రీకాళహస్తి సర్కిల్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ పద్మావతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారులు జీఎస్టీ రిటర్నులను సకాలం దాఖలు చేయాలని తెలిపారు. ప్రతి వ్యాపారి విక్రయానికి సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా జారీ చేయాలన్నారు. రూ.5 కోట్ల కంటే ఎక్కువ టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా ఈ-ఇన్‌వాయిస్ ఇవ్వాలన్నారు. చాలా మంది వ్యాపారులు ఈ-వే బిల్లులు జారీ చేస్తూ టీడీఎస్, టీసీఎస్ పన్ను చెల్లింపుదారులకు ఈ-ఇన్‌వాయిస్‌లను అనుసంధానం చేయకుండా లావాదేవీలు జరుపుతున్నట్లు సెంట్రల్ నేషనల్ ఇన్వెస్టిగేటివ్ సెంటర్ గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ధనంజయ, అరుణ్ కుమార్, ట్యాక్స్ కన్సల్టెంట్లు, ఆడిటర్లు, ఛార్టెడ్ అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి

రెవెన్యూ మంత్రికి టీడీపీ నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులు రెవెన్యూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, కల్వర్టుల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులకు సహకరించాలని అమరావతిలో మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మండలాభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి చెప్పారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో భాస్కర్, టి.సుబ్రమణ్యం, కె.సుబ్రమణ్యం, మాణిక్యరెడ్డి, హరి, పి.వేలురెడ్డి, రాజశేఖర్ యాదవ్, నరేష్ ఆచారి, గిరీష్ ఉన్నారు.

మంత్రి లోకేశ్‌తో యాచేంద్రనాయుడి భేటీ



లోకేశ్‌తో యాచేంద్రనాయుడు

నాగలాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను నాగలాపురానికి చెందిన టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ యాచేంద్ర నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నాగలాపురం - టీపీకోట రోడ్డు గత వైసీపీ నిర్లక్ష్యం కారణంగా ఛిద్రమైపోయిందని వివరించినట్లు తెలిపారు. ఈ మార్గంలో 25 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని మంత్రిని కోరినట్లు యాచేంద్ర నాయుడు తెలిపారు.

సీపీఎం జిల్లా సభల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ మూడు సంవత్సరాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలను రూపొందించడమే నిర్వహిస్తున్న సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. డిసెంబరు 1, 2 తేదీల్లో సత్యవేడులో నిర్వహించే సభల పోస్టర్లను రాము, ధనంజయులు, జేకే రమణయ్య, చిన్న గురవయ్య, తిరుమలు, సుబ్బయ్య, రమణమ్మ లతో కలిసి పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఎం నిర్మాణపరంగా మరింత పటిష్టం చేసుకునేందుకు గత మూడు సంవత్సరాలు చేసిన కృషిని సమీక్షించి కొత్త కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు.

ఆక్రమణలపై కొరడా





సన్నిధి వీధిలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు - పీవీపీ కూడలి వద్ద ఆక్రమణలను తొలగించాల్సిందిగా సూచిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాకపోకల అంతరాయానికి కారణమవుతున్న ఆక్రమణలపై అధికారులు కొరడా ఝులిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సన్నిధి వీధిలోని జలవినాయక కూడలినుంచి టూరిస్టు బస్టాండు వరకు రోడ్డు అత్యంతంగా ఇరుగ్గా మారింది. ఆలయం మూడో గేటు, నాల్గో గేటు వద్ద నిత్యం వాహనాలు స్తంభించిపోతున్నాయి. ఇక్కడ ఆక్రమణలతో రోడ్డు కుచించుకుపోయింది. పది రోజుల క్రితం రోడ్డుపై ఆక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందిగా పోలీసు, పురపాలక సంఘ అధికారులు సంయుక్తంగా వ్యాపారులకు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువ జామున యంత్రాలతో అధికారులు రంగంలోకి దిగారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, 1టౌన్ సీఐ గోపి, సిబ్బందితో సన్నిధివీధిలో రోడ్డుపైకి చొరబడ్డ ఆక్రమణలను తొలగించారు. ఎక్కడా వివక్షకు తావులేకుండా అధికారులు జల వినాయక కూడలి నుంచి టూరిస్టు బస్టాండు వరకు దగ్గరుండి ఆక్రమణలు తొలగింపును పర్యవేక్షించారు. ఇక సాయంత్రం డీఎస్పీ నరసింహమూర్తి,సీఐ గోపి పైవీపీ కూడలి వద్ద బాబుల్లాహారం కోనేరు పరిసరాలు, ఆర్టీసీ కూడలి నుంచి శివపార్వతుల కూడలి వరకు నడుచుకుంటూ ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డుపైకి చొరబడ్డ వారికి తొలగించాల్సిందిగా సూచనలు ఇచ్చారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

రేణిగుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ఆర్ఎస్ఎం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డి.ఎం.ప్రత్యూష, సర్పంచు నగేష్, ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం గిరిబాబు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి సహకరించండి



హేమలతను సన్మానిస్తున్న త్యాగరాజు

వరదయ్యపాళెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ ఛైర్మన్ సజ్జా హేమలతను వరదయ్యపాళెంకు చెందిన జాతీయ చేనేత, దేవాంగ సంఘం నాయకుడు గుత్తి త్యాగరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను సన్మానించారు. చేనేతల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల వితరణ



క్రీడాపరికరాలతో మాధురి గోల్డ్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మాధురి గోల్డ్ నిర్వాహకులు క్రీడాసామగ్రి అందజేశారు. హాకీ స్టిక్స్, టేబుల్ టెన్నిస్ కిట్లు, వాలీబాల్, బాస్కెట్ బాల్ తదితరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామండూరు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు



రేణిగుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు అటవీ ప్రాంతంలోని వాగు వద్ద శుక్రవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ వాగులో స్నేహితులను కాపాడి ఓ మిత్రుడు గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రదేశానికి వచ్చే సందర్శకులను హెచ్చరిస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జరిగిన ఈ సూచిక బోర్డుల్లో వాగులో లోతైన గుంతలున్నాయి, తగు కొట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

షార్‌ను సందర్శించిన ప్రముఖులు

సూళ్లూరుపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను శుక్రవారం ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ మాధవి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(జీఏడీ) జీవాజి మోహన్ సందర్శించారు. ముందుగా వీరు అట్టహాసిటిష్ పులికాట్ సరస్సును పరిశీలించారు. అనంతరం షార్‌లోని రెండు ప్రయోగ వేదికలు, స్పేస్ మ్యూజియాన్ని తిలకించారు. రాకెట్ ప్రయోగాలతో పాటు అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాల గురించి షార్ అధికారులు వివరించారు. వీరి వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ నరసింహనాయుడు ఉన్నారు.

ఆధార్ కార్డుతో ఐపీపీబీ అకౌంట్ ప్రారంభం



ఐపీపీబీపై అవగాహన కల్పిస్తున్న పోస్ట్‌మాస్టర్ సోమనాథ్

సత్యవేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో కేవలం ఆధార్ కార్డుతో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకింగ్ (ఐపీపీబీ) అకౌంట్‌ను ప్రారంభించవచ్చని సత్యవేడు పోస్ట్‌మాస్టర్ సోమనాథ్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఐపీపీబీ అకౌంట్ ఏర్పాటుపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును లబ్ధిదారుల ఖాతాకు జమ చేసేందుకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ ఖాతా అవసరమన్నారు. లబ్ధిదారుల అకౌంట్‌కే నేరుగా నగదు బదిలీ అవుతుందన్నారు. పోస్టల్ ఖాతాలను ప్రారంభించేందుకు తపాలా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీలలో ప్రత్యేక శిబిరాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ... మండలంలో 5,775 ఆకౌంట్లకు గాను ఇప్పటి వరకు 2,226 అకౌంట్లకు మాత్రమే ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఖాతాలకు ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు.

కేవీబీపురంలో...

కేవీబీపురం: ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు నిర్వహణాలకు వరం లాంటిదని సచివాలయ, పోస్టల్ సిబ్బంది తెలిపారు. నిర్వహణాలకు పోస్టల్ బ్యాంకింగ్ కోసం వారి ఆధార్‌కార్డులను అనుసంధానం చేసి బయోమెట్రిక్‌ను సేకరించారు. ఈ ఖాతాల ద్వారా బ్యాంకులకు వెళ్లి నిరీక్షించాల్సిన పనిలేకుండా పోస్టల్ సిబ్బంది ఇంటి వద్దకే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందజేస్తారని చెప్పారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించండి



శ్రీకాళహస్తిలో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను స్పెషల్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. డీలర్ల వద్ద రికార్డులను పరిశీలించి కల్తీ పురుగు మందులు, ఎరువులు ఎట్టి పరిస్థితిలో రైతులకు విక్రయించరాదని ఆదేశించారు. ఎవరైనా నాసిరకం ఎరువులు, పురుగుమందులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ప్రభుత్వం ఆదేశించిన ధరలకే విక్రయించాలన్నారు. దాడుల్లో సత్యవేడు ఏడీఏ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుచ్చినాయుడుకండ్రిగ పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, భౌతిక నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లో నిల్వల వ్యత్యాసాలను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు తీసుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భారతి పాల్గొన్నారు.

అనుమతులు లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: అనుమతులు లేని ఎరువులను విక్రయిస్తే ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని

పౌష్టికాహారం తీసుకోండి

ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాలను తీసుకోవాలని పాపానాయుడుపేట జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటసుబ్బయ్య అన్నారు. జూనియర్ కళాశాలలో తిరుపతికి చెందిన పిరమిడ్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి బ్రష్‌ను మార్చాలని తెలిపారు. పుచ్చిన పళ్లను ఫిల్లింగ్ చేసుకోవాలని తెలిపారు. చాక్లెట్, కూల్‌డ్రింక్స్, స్వీట్స్ తిన్న వెంటనే నోటిని పుక్కిలించాలని తెలిపారు. వంకర, ఎత్తుపళ్లకు క్లిప్ ట్రీట్‌మెంట్ ద్వారా సరిచేసుకోవచ్చని తెలిపారు. డాక్టర్ కుమార్, హేమంత్‌కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం



శివాలయాల్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడ గ్రామంలోని శివాలయంలో శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో రాస్ మహిళా భారతి సంఘాల సభ్యులు కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు అనంతరం శివలింగాకృతిలో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. ఇక సహాశివపురంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన సభ్యులకు జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ హరిబాబు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి, వెంకటకుమార్, మునిప్రసాద్‌సారథి తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై దర్యాప్తు చేయాలి: కురుగొండ్ల

డక్కిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై లోతుగా దర్యాప్తు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేందుకే పనిచేసిందని, పేదల గురించి పట్టించుకోలేదని విమర్శించారు.

పరశురామేశ్వరుడి సేవలో మహారాష్ట్ర సీఎం తనయుడు



ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని మహారాష్ట్ర సీఎం ఏకనాథ్‌షిండే తనయుడు శ్రీకాంత్ షిండే దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, మాజీ సర్పంచ్ పద్మనాభనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపు తనిఖీ



ఆధార్ క్యాంపు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న విద్యాశాఖాధికారి హేమమాలిని

పిచ్చాటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారూరు సచివాలయంలో జరుగుతున్న ఆధార్ క్యాంపును మండల విద్యాధికారి హేమమాలిని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆధార్ నిర్వాహకులను ఆదేశించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. పిల్లల ఆధార్ సమస్యలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లం పాఠశాలను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం



ఆనంద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను అగ్రస్థానంలో నిలపడమే తన లక్ష్యమని హెచ్ఎం ఆనంద్ అన్నారు. ఐజీవం పల్లం పాఠశాల హెచ్ఎం ఆనంద్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. దీన్ని పురస్కరించుకున్న హెచ్ఎంను ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా కేవీఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ పాఠశాల మౌలిక వసతులను పెంపొందించడంలో విశేష కృషి చేశారన్నారు. ఆనంద్ గురువు డాక్టర్ నారాయణస్వామి, నాగలాపురం ఎంఈవో శీగల చంద్రశేఖర్, రేణుక, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



ఆదవరం గిరిజనకాలనీలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కేవీబీపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి సూచించారు. శుక్రవారం మండలంలోని వేములపూడి, ఆదవరం, పెరిందేశం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీల్లో సమావేశాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం గర్భంలోని శిశువుల ఎదుగుదలకు సహకరిస్తుందన్నారు. బాలింతల్లో బిడ్డకు అందించే పాల వృద్ధి పెరుగుతుందన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రేణిగుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం బాటిళ్లను కలిగిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. మండలంలోని గాజేష్ నగర్‌కు చెందిన గజ్జల సురేష్ ఫతర్ బైపాస్ మార్గంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి తనిఖీ చేయగా 10 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు విధించినట్లు ఎక్సైజ్ సీఐ జయరామారావు తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐ విజయేశ్వర నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.